# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ గుజరాత్ లో వన్యప్రాణుల పునరావాస కేంద్రమైన వంతారాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ప్రారంభించారు.
- ❖ మహిళల భద్రతకు శక్తి యాప్ తీసుకొస్తున్నామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- ❖ ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేవారి వయోపరిమితిని పొడిగిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- ❖ రాష్ట్రంలో ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన జిల్లాల్లో ఎన్నికల నియమావళిని ఉపసంహరిస్తున్నామని ఎన్నికల సంఘం ఈ రోజు ప్రకటించింది.
- ❖ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నోటిఫికేషన్ ను ఈ నెలలో విడుదల చేయనున్నామని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.

==========================

గుజరాత్ లో వన్యప్రాణుల పునరావాస కేంద్రమైన వంతారాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ప్రారంభించారు. వంతారాలో 2 వేల కంటే ఎక్కువ జాతులు 1.5 లక్షలకు పైగా అంతరించిపోతున్న జంతువులు రక్షించబడుతున్నాయి. వంతారా కేంద్రంలోని వివిధ సౌకర్యాలను ప్రధానమంత్రి స్వయంగా పరిశీలించారు. అక్కడ పునరావాసం పొందిన వివిధ జాతుల జంతువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

==========================

మహిళల భద్రతకు శక్తి యాప్ తీసుకొస్తున్నామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మహిళా దినోత్సవం రోజున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ యాప్‌ను ప్రారంభించనున్నారని మంత్రి తెలియజేశారు.

శాసనమండలిలో ఈరోజు ఆమె మాట్లాడుతూ... గత ప్రభుత్వం తీసుకువచ్చిన దిశ చట్టానికి ఎటువంటి చట్టబద్ధతలేదని, దాని స్థానంలో శక్తి యాప్ ని తీసుకొస్తున్నామన్నారు.

(వాయిస్ 28 సెకన్లు)

==========================

ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వయోపరిమితిని పొడిగిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నాన్ యూనిఫామ్ ఉద్యోగాలకు వయోపరిమితి 34 నుంచి 42 సంవత్సరాలకు, యూనిఫామ్ ఉద్యోగాలకు వయోపరిమితి 2 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంవత్సరం సెప్టెంబరులోపు జరిగే నియామకాలకు ఈ వయోపరిమితి పెంపు వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

==========================

రాష్ట్రంలోని 3 శాసనమండలి స్థానాల ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించారు. ఈరోజు మధ్యాహ్నం 8 రౌండ్ల లెక్కింపు పూర్తయిన అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, ఏలూరు జిల్లా కలెక్టరు కె. వెట్రీసెల్వి ఆయనకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. మరోవైపు ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించారు. మొత్తం తొమ్మిది రౌండ్లకు గానూ, ఈరోజు ఉదయం చివరి రౌండ్ పూర్తయ్యే సరికి ఆయనకు స్పష్టమైన ఆధిక్యం లభించడంతో ఆలపాటిని రాజేంద్రప్రసాద్ ను విజేతగా ప్రకటించారు.

==========================

రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడటంతో ఎన్నికల నియమావళి అమలవుతోన్న జిల్లాల్లో ఈరోజు నుంచి ఎన్నికల కోడ్ ఉపసంహరిస్తున్నామని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, అనకాపల్లి, ఉభయ గోదావరి జిల్లాలో ఈ ఎన్నికల కోడ్ ఎత్తివేస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

==========================

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నోటిఫికేషన్ ను ఈ నెలలో విడుదల చేయనున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈరోజు శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. ఈ నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ ను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయంలోనే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని మంత్రి గుర్తు చేస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

==========================

అర్హత ఆధారంగానే రేషన్ కార్డులను మంజూరు చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈరోజు శాసనసభలో తెల్ల రేషన్ కార్డులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... ఈ కేవైసీ నిర్వహణ కారణంగా బియ్యం కార్డులకు సంబంధించిన సేవలు నిలిపివేశామని అన్నారు. రేషన్ కార్డుల ఈ-కేవైసీ వివరాల కోసమే ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారి వివరాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కోటీ 94 లక్షల రేషన్ కార్డులు ద్వారా 4.26 కోట్ల మందికి లబ్ది చేకూరుతుందని నాదెండ్ల మనోహర్ వివరించారు.

విరామం

==========================

సైబర్ నేరాలు ఆధునిక యుగాన్ని ఆందోళనకు గురి చేస్తున్నాయని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు.సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈరోజు ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ..., ఇటీవల సైబర్ మోసాలు అధికమవుతున్న నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలలో ఈ విషయంపై చర్చించారన్నారు. సైబర్ మోసాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

==========================

చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. శాసనమండలిలో ఈరోజు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... చేనేత కార్మికులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద 3 వేల నుంచి 4 వేల రూపాయలకు పెంచామని, 50 సంవత్సరాలు నిండి కార్మికులకు పింఛన్లు అందిస్తున్నామన్నారు. నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో పాటు త్రిఫ్ట్ పథకం, క్లస్టర్ అభివృద్ధి పథకం, ముడి పదార్థాల సరఫరా పథకం, నేతకారుల ముద్ర పథకం అమలు చేస్తున్నామన్నారు. చేనేత వస్త్రాల మార్కెటింగ్ కు సహకారమందిస్తున్నామని ఎస్.సవిత మాట్లాడుతూ...

(వాయిస్ 26 సెకన్లు)

==========================

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ. భీమారావు పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, హెల్మెట్ ధరించకపోవడంతో ఎక్కువ మంది ప్రమాదాల్లో మరణిస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలలో 90 శాతం ద్విచక్ర వాహనం నడిపే వారి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

==========================

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈరోజు శాసనమండలిలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టాలనే ఔత్సాహికులకు పాలసీ గైడ్ లైన్స్ అందజేస్తామన్నారు. ఏపి MSME వెబ్ సైట్ లో పూర్తి స్థాయిలో పాలసీ డాక్యుమెంట్స్ అందుబాటులో ఉన్నాయని మంత్రి వెల్లడిస్తూ.....

(వాయిస్ 32 సెకన్లు)

==========================

కురుపాం మండలం సరదాపురం గ్రామంలో జరుగుతున్న పీఎం జన్ మన్ పనులు వేగవంతం కావాలని పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఈరోజు ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీఎం జన్ మన్ కింద ఇచ్చిన లక్ష్యాల దిశగా అధికారులు కృషి చేయాలని అన్నారు. అదే గ్రామంలో చేపడుతున్న ఆర్.డబ్ల్యూ.ఎస్ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం పలు అంగన్వాడీ కేంద్రాలను, పాఠశాలలను తనిఖీ చేసి.. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. పాఠశాలల్లో అందించే వసతుల్లో లోటు పాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

============================

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏజెన్సీలోని 7 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. రంపచోడవరంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధికి సంబంధించి పాఠశాలల ఉపాధ్యాయులతో ఈరోజు ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా  మాట్లాడుతూ... ఏజెన్సీలోని అన్ని మండలాల పరిధిలో ఉన్న అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలలో మానసిక వికలాంగులను గుర్తించే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

============================

============================